# ఏలూరు గేటు


## – డాక్టర్ ఎ.వి. రమణప్రసాద్

ఈ మధ్యే మండల్ రెవెన్యూ ఆఫీసు నుండి ఏలూరులోని కలెక్టరాఫీసుకు బదిలీ అయ్యాను. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఇంటి అద్దె ఇచ్చుకోవడం, పైగా వున్న చోటు నుండి సామాన్లు కదిలించడం ఇవన్నీ భరించే తాహతులేక రోజూ అప్ అండ్ డౌన్ చేస్తున్నాను.

ఎప్పుడైతే ప్రొద్దున, సాయంత్రం తిరిగిన రూట్‌లోనే తిరుగుతూ వుంటానో బస్సు కిటికీలో నుంచీ చూడ్డానికి క్రొత్తదనంగాని, అపరిచిత ప్రదేశాలుగాని లేనందువల్ల స్వగతంగా ఆలోచనలు పుంఖానుపుంఖాలుగా పుట్టుకొచ్చేవి. ఆ విధమైన నా ప్రయాణ మార్గ మధ్యంలో ఇంచుమించు ప్రతి రోజూ ఎదురయ్యే పెద్ద తలనొప్పి ఒకటి చెప్పడం మరచిపోయాను. మరచిపోయాను అని అనడం కంటే అది అత్యంత ప్రాధాన్యమైన అంశం కాబట్టి ప్రత్యేకంగా ప్రస్తావిస్తానని చెప్పడం సబబు.

రోజూ నేను ప్రయాణించే రోడ్డు ఒకప్పుడు టంగుటూరి ప్రకాశం పంతులుగారి టైంలో బ్రిటీషు వాళ్ళు ఏర్పరచిన దండుబాటే. విజయవాడ – విశాఖపట్నం రైలు మార్గమూ, మదరాసు – కలకత్తా జాతీయ రహదారి ఈ రెండూ ప్రక్క ప్రక్కనే బడిక చెట్టపట్టాలేసుకొని కలిసి వెళ్ళే స్నేహితుల్లా ఏలూరులోదూరి మూడు గేట్లూ దాటి తాడేపల్లిగూడెం వరకూ వెళ్ళి విడిపోతాయి. ఆంధ్రా మొత్తం మీద బాగా చీకాకు కల్గించేది, గంటల గంటల కాలాన్ని కబళించేది ఈ ఏలూరు రైల్వే గేటేనట – లారీల వాళ్ళు మొత్తుకుంటూ వుంటారు.

నేను రోజూ ఆర్.టి.సి. బస్సుల్లోనే వెళ్తాననే నమ్మకం లేదు. చాలా సార్లు నాకు లారీలే శరణ్యం. రోడ్డు రవాణా సంస్థకు ఏటా వచ్చే లోటుకు కారణం కొంత ఈ లారీలు కూడానని ఎవరైనా అంటే అనవచ్చు కానీ సామాన్య మానవుని అత్యవసర సకాల ప్రయాణానికి ఈ లారీలు పుష్పక విమానాలని చెప్పడం అతిశయోక్తి కాదు. ఒక రకంగా ఈ లారీల వాళ్ళు బీదా బిక్కీలకు 'మేమూ ప్రయాణం చేయగలం' అనే ఆత్మ విశ్వాసం ప్రసాదించే ఆరాధ్య దేవుళ్ళు.




ఏలూరు గేటు పడిందంటే చాలు ఒకటే సందడి. సోడాలు, వేరుసెనక్కాయలు, జామకాయలు, పాప్‌కారన్, బిస్కెట్లు, బఠాణీలు, చక్రాలు, మజ్జిగ – ఇవన్నీ ఒక్కసారిగా చుట్టు ప్రక్కల పాకల్లో నుంచీ బిలబిలా రోడ్డు మీదికి వచ్చేస్తాయి. డబుల్ లైను కాబట్టి ఒక్కోసారి రైలు వెళ్ళినా సరే వచ్చే మరో గూడ్సుబండి కోసం గేటు అలాగే మూసి వుంటుంది. ఒకసారి గేటు మూత పడిందంటే సుమారు యాభై అరవై లారీలు, పదో పన్నెండో బస్సులు, మధ్యలో జీపులు, కార్లు అటూ ఇటూ కొండవీటి చేంతాడులా, మంథర పర్వతాన్ని చుట్టుకున్న ఆదిశేషువు ఆద్యంతాల్లా కనిపిస్తాయి. సుమారు ఎడాపెడా రెండు కిలోమీటర్ల దూరాన్ని తిను బండారాలమ్మే వాళ్ళు మంత్రిగారి టూర్ ప్రోగ్రాంలో పోలీసుల్లా అటూ ఇటూ తిరుగుతూ, అమ్ముతూ ఆక్రమిస్తారు.

ఈ అమ్మేవాళ్ళల్లో చాలా మంది పిల్లలే!

వీళ్ళ కడుపు కొట్టి మరీ కడుపు నింపుకునే పెద్దరికానికి. లొంగిపోయిన పసిపిల్లల బాధామయ జీవితాలను, బాల కార్మికుల హృదయ విదారక జీవన విధానాలను అక్కడక్కడా చదువుతూ, కళ్ళారా చూస్తూ ఏమీ చేయలేని అసహాయ మానవులు, కొంత సానుభూతికి కరిగి 'ఇదో రకం చేయూత పాపం' అనుకొని వాళ్ళ దగ్గర ఏదో ఒకటి కొనుక్కొని తృప్తిపడే జాతి గుండెలు, ఇంటికి ఎప్పుడు వెళతామో, ఎప్పుడు తింటామో తెలియక ఆవురావురుమనే ఆకలి పొట్టలు, కనిపించిందంతా చూచి పేచీ పెడుతూ రక్త సంబంధీకుల అధీనంలో వుంటున్న అదృష్టజాతకులు – వీళ్ళే ఆ బాల వ్యాపారుల తినుబండారాల కొనుగోలుదార్లు. వాళ్ళే ఆ పిల్ల వర్తకుల వినియోగదార్లు, వాళ్ళిచ్చే నాలుగురాళ్ళే ఆ చిన్నారుల జీవన సోపానాలకు పడికట్టు రాళ్ళు.

అందరూ లారీల దగ్గరికి వెళ్ళి బస్సుల్లో ఎక్కి అమ్ముతూ వుంటే ఒకానొక స్త్రీ మాత్రం తన పాకలోనే వుండి, ఒక స్టూలుమీద కూర్చొని విమ్మరసం అమ్ముతూ వుంటుంది.

గేటు తెరిచే లోగా లారీ క్లీనర్లు,

డ్రైవర్లు, ప్యాసింజర్లు అందరూ వెళ్ళి ఆ నిమ్మరసం త్రాగి వస్తూ వుంటారు ఇదే రూటులో రోజూ వెళ్ళే వాణ్ణి కదా ఒక రోజు సంగతేమిటో ఆరా తీశాను.


ఆవిడకి రెండు కాళ్ళూ లేవు. పెద్ద బానల్లో నీళ్ళు పోయించి వాటిల్లో ఐసు ముక్కలు వేయించి పంచదార, నిమ్మ రసం కలిపి గ్లాసు రూపాయి చొప్పన కూర్చున్న చోటు నుండే అమ్ముతూ వుంటుంది. ప్రొద్దున్నే నీళ్ళూ, నిమ్మ పళ్ళూ, పంచదార, ఐసుముక్కలు ఇవన్నీ ఆమె మనవడే వచ్చి అమర్చి పోతూ వుంటాడట. ఆవిడ నిమ్మరసం అమ్మకానికి పెట్టిన మొదట్లో రెండు మూడు రోజులు ఎవరూ వచ్చేవారు కాదట. తిరిగి అమ్మే వాళ్ళకే బాగా బేరాలయ్యేవి. ఆ ప్రక్కనే పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న ఒక కుర్రాడు రాజకీయ పార్టీల వాళ్ళకు, సినిమాలకు, వ్యాపార సంస్థలకు పార్ట్ టైం జాబ్‌గా బ్యానర్లు, పోస్టర్లు వ్రాసి పెడుతూవుంటాడు. ఆ అబ్బాయికి వాళ్ళ ఇంట్లో వాళ్ళు విశల్ అని పేరు పెడితే తనకు నచ్చిన పేరు గద్దర్ అని మార్చుకున్నాడట. ఆ యువకుడు ఈ నిమ్మరసం మామ్మని చూచి జాలిపడి చక్కని ముత్యాల్లాంటి అక్షరాలతో ఒక బ్యానర్‌మీద 'చల్లని తియ్యని నిమ్మ రసం. గ్లాసు ఒక రూపాయి. దయచేసి ఇక్కడికే వచ్చి త్రాగండి' అని వ్రాసి ఒక ప్రక్కగా రెండు కాళ్ళూ లేని వికలాంగురాలు కర్రల ఆసరాతో నిలబడి ముకుళిత హస్తాలతో ఆహ్వానిస్తున్నట్టుగా బొమ్మగీచి నల్లురికీ కన్పించేలా ఆ బ్యానర్ వేలాడ గట్టాడట. చూచిన ప్రతి ఒక్కరూ మొదట్లో జాలిపడి వచ్చే వారు. ఆ తర్వాత రసం కూడా రుచిగా వుండడంతో బాగా గిరాకీ పెరిగింది.

నాకు ఆ ఉదంతం వింటూ వుంటే ఆనందబాష్పాలు రాలాయి.

'నాకది లేదు. ఇది లేదు. నేనెందుకు బ్రతకాలి?' అని నన్ను నేనే వేసుకుంటున్న పిచ్చి ప్రశ్న సిగ్గేసి ఇంక పొడసూపదనే ధైర్యం కల్గింది నాకు.

అక్కడ తినుబండారాలమ్మే పిల్లవాళ్ళదే కాదు నిమ్మరసం మామ్మది కూడా అంతో ఇంతో పెట్టుబడి పెట్టాల్సిన వ్యాపారమే. మొదట్లో అవన్నేసి ప్రారంభించేవాళ్ళు, ఓ వారం రోజుల్లో

## పట్టుబట్ట



ఆంధ్ర కేసరి చిన్నతనంలో ఒకసారి పరీక్ష ఫీజు కట్టడానికి మూడు రూపాయలు కూడా దొరకలేదు. ఆయన తల్లి చాలా ప్రయత్నించింది. లాభంలేకపోయింది. వినోదరాయుడుపాలెం లోని తన మేనమామ వద్దకు వెళ్లి మూడు రూపాయలు తెద్దుమని పన్నెండుమైళ్లు నడిచి వెళ్లాడు. తీరాచేసి మేనమామ ఊళ్లో లేడు. నిరాశతో తిరిగివచ్చాడు. ఫీజు ఎలా కట్టాలి? ప్రకాశంగారి తల్లి తన పట్టుబట్టను తాకట్టు పెట్టి రూపాయలు తెచ్చి ఆయనకు ఇచ్చింది.

–ఎం.ఎస్.ఎం.

స్వంత లాభం మీదే ఎదిగిపోయేవారు. ఏలూరు గేటు నిజంగా వాళ్ళ పాలిటి జీవనోపాధి కేంద్రం.

తెలివి తేటలంటూ వుంటే బ్రతికే విధానం పెద్ద బ్రహ్మ విద్యేం కాదు. మానసిక బలహీనతల్ని, పాపభీతిని, దైవభక్తిని, మూఢ నమ్మకాల్ని లోకంలో ఎంత మంది క్యాష్ చేసుకోవడం లేదు.

ఏడెనిమిదేళ్ళుంటాయి. ఎర్రగా, బొద్దుగా చూడముచ్చటగా ఎంత బాగుంటాడో ఆ అబ్బాయి. అచ్చం పిల్ల అల్లాలా ముద్దొస్తూ వుంటాడు. పేరు సుభాని. గేటు దగ్గర సుమారు ఉదయం ఏడు గంటల నుండి తన సంపాదన ప్రారంభిస్తాడు. మొక్కజొన్న పొత్తులు కాల్చేవాళ్ళ దగ్గరికెళ్ళి ఇన్ని నిప్పులు అగ్నిపాత్రలో పోయించుకుంటాడు. కాస్త సాంబ్రాణి పొగ అందులో వేసి నెమలి ఈకల కట్టతో ఆ ధూపాన్ని ఆవాహనం చేస్తూ లారీ లారీ బస్సు బస్సూ తిరుగుతూ వుంటాడు. లారీలకు బాడీ ముందు టైర్ల క్రిందే కాకుండా బస్సుల్లోకి కూడా ఎక్కి ప్యాసింజర్లందరికీ సాంబ్రాణి పొగ ఘాటెక్కిస్తూ మౌనంగా నెత్తి మీద నెమలీకలు పెడుతూ నడుస్తూ వుంటే ఊపిరి సలపనంతగా చిల్లర టపటపా పడుతూ ఇత్తడి పళ్ళెం నిండిపోతూ వుంటుంది.

నేను ఆసక్తితో విషయం సేకరించా. అక్కడున్న నిమ్మరసం మామ్మకుగాని, వ్యాపారస్తులకుగాని, సైకిల్ కొట్టు, కిళ్ళీ కొట్టు ఓనర్లకుగాని వాళ్ళ వాళ్ళ పెట్టుబడులు పోగా నికరంగా సుభానీ కొచ్చినంత లాభం చస్తే రాదట. పెట్టుబడిలేని సుభానీ ఆదాయం ముందువాళ్ళంతా బలాదూర్. పైగా ఈ సుభానీ గాడు గేటు తెరచి వున్నప్పుడు కూడా తన ధూపాన్ని తన తోటి కుర్రాళ్ళ నరుకుల మీద ప్రయోగించి అవీ ఇవీ ఫ్రీగా తింటూ కాలక్షేపం చేస్తాడట!

ముక్కు పచ్చలారని సుభాని, నిలబడడం చేతకాని నిమ్మరసం మామ్మ, అమ్ముకుంటూ బ్రతుకుతున్న అర్భకులు, వీళ్ళంతా జీవన పోరాటంలో భాగస్వాములు కాగా లేనిది, ఏ మాత్రం చదువూ సందెలు లేని వాళ్ళంతా లోకంలో హాయిగా జీవించగా లేనిది, ఉద్యోగం చేస్తూ నెలనెలా అంతో ఇంతో ఖచ్చితమైన జీతం తెచ్చుకుంటున్న నాకేం తక్కువ! సమాజంలో రోజు రోజుకూ పెరుగుతున్న జీవన వ్యయం, ఆకాశాన్నంటుతున్న ధరలు ఇవన్నీ నా కొక్కడికే కాదు కదా! కాబట్టి నా జీవన విధానం లోనే ఎక్కడో లోపం వుంది. ఎక్కడో పొంచి వున్న ఆ పొరబాటును కనిపెట్టి సవరించుకోవాలే గాని అనవసరంగా అనంతృప్తికి లోను కావడం, నిరుత్సాహపడడం వివేకవంతుల లక్షణం కాదు – అనే ఆలోచనా విధానాన్ని నాకు నేర్పింది ఏలూరు గేటే. నాలోని ఈ రకమైన అంతశ్చేతనకు ఆలంబనం ఈ ఏలూరు గేటే. ఈ ఏలూరు గేటు ఇంకా ఎందరికో వున్న తెలివి తేటల్ని తెలివిగా సొమ్ము చేసుకునే సుఖ జీవన విధానం నేర్పింది. అంతే కాదు. ఈ ఏలూరు గేటు మేలుగిళ్ళకు పొంగడం కానీ, క్రుంగడం కానీ చేతకాని అచేతన. మిట్టపల్లాల బాట. చీకటి వెలుగుల సంగమం.

ఈ పాపిష్టి గేటు ఎంత మంది అభాగ్యులకు తమ ఆప్తుల మృతదేహాలను సైతం కడసారి చూపులకు నోచుకోకుండా చేసిందో?

ఎంత మంది ఆశాజీవుల ఉద్యోగ ప్రయత్నాలకు, పరీక్షా సమయాలకు కాలాతీత కాలసర్పమై కాటేసిందో?

ఈ గేటు ఎంత మంది ఉద్యోగుల సర్వీసుల్లో లేటు మార్కు లేయించి ఎన్ని మెమోలిప్పించిందో?

ఇలా కొందరు నష్టజాతకుల పాలిటి ముదనష్టపు గేటు మరి కొందరు పుణ్యాత్ములకు అదృష్టదేవతలా, అభీష్ట వరప్రదాయినిలా కనిపించడం కూడా కద్దు.

"గేటు మూతపడి ఓ గంట ఆలస్యం అయింది కాబట్టి సరిపోయింది.లేకుంటే ఆ బస్సు బస్సే ఆ కాలిన బ్రిడ్జితోపాటు అగాధంలోకి కూరుకొని పోయి వుండేది. ఎంత అదృష్టం!"

"మాకు అవతల బస్సు టైర్లు పంచరై ఎంత లేటయ్యిందని మీరు చూచి చూచి వెళ్ళిపోయుంటారని ఎంత కంగారు పడ్డామో! దేవుని దయ వల్ల మీకూ గేటుపడి లేటయింది. కాబట్టి ఎంత గొప్పపని కలిసొచ్చింది!"

"మీ టెలిగ్రాం అందేసరికి ఎంక్వయిరీలో విచారిస్తే ఇప్పుడు బస్సులేం లేవు. అన్నీ వెళ్ళిపోయాయన్నారు. సరే చూద్దామని ఆటోలో గేటు దగ్గరికి వచ్చే సరికి గేటు పడినందువల్ల ఎదురుగా గుంటూరు బస్సు. అది దొరికింది కాబట్టి నా ప్రాణానికి ప్రాణమైన చిట్టెమ్మను కడసారి చూడగలిగాను"

– ఈ విధంగా దూషణ, భూషణ, తిరస్కార, పురస్కారాలకు అతీతంగా మానవ హృదయ కవాటంలా ఇంకా ఇప్పటికీ ఏలూరు గేటు మూసుకుంటూ తెరుచుకుంటూనే వుంది.